క్లుప్తంగా

కాజ్‌వే పై రాకపోకలు ప్రారంభం



లింగాల(వత్సవాయి): గతేడాది మునేటికి వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న కాజ్‌వేను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కాజ్‌వేపై రాకపోకలను గురువారం ప్రారంభించారు. వరదలకు కాజ్‌వే దెబ్బతినడంతో రెండు కోట్ల నిధులతో మరమ్మతు పనులు చేశారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను కలుపుతూ ఈ కాజ్‌వే ప్రధానంగా మారింది. పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి రెండుచోట్ల డ్రైన్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ పరుశురాముడు, మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, లింగాల సర్పంచ్ చల్లా విజయకుమారి, ఎంపీటీసీ వేముల శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం

నందిగామ రూరల్: సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కుట్టుశిక్షణను విద్యార్థులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించారు. సుజనా ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎనిమిదో బ్యాచ్ కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ ద్వారా మహిళలు, యువతకు అందిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేరీ విజయ, బచ్చుల బోస్, వీరాస్వామి, మండవ విజయకుమారి, ఏచూరు రాము తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మందుల పంపిణీ



పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం అందించే ఆల్‌బెండాజోల్ మాత్రలను ఎంపీపీ మార్కపూడి గాంధీ గురువారం ఎంఈఓ డి.రవీంద్రకు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈమందులను ఆరోగ్య సిబ్బంది ద్వారా పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, హెచ్ఎం ఎస్.బాబూరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేటఅర్బన్: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలలో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీముత్యాలమ్మ అమ్మవారు శ్రీకనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. దేవస్థాన కుమ్మరి శాలివాహన వంశస్తులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులు కొంకిమళ్ల సురేష్, అప్పన వెంకట పిచ్చయ్య, కమిటీ సభ్యులు చేడె శ్రీరంగం, నాగప్రసాద్, నాగమల్లేశ్వరాచారి, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



కంచికచర్ల: ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం సాగుపై గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లకు స్థానిక రైతుభరోసా కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈసందర్భంగా నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఐకే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన మేలైన సాగు పద్ధతులు, సూక్ష్మ, స్థూల పోషకాల లోపాలు, వాటి యాజమాన్య పద్ధతిపై అవగాహన కల్పించామన్నారు. అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే లాభాలు, పంటలలో అధిక దిగుబడుల సాధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంచికచర్ల, వీరులపాడు మండల వ్యవసాయ అధికారులు కె.విజయకుమార్, బి. జోగేంద్రప్రసాద్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కూటమి

ఎంపీపీ మార్కపూడి గాంధీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14నెలల కాలంలోనే ప్రజావిశ్వాసం కోల్పోయిందని పెనుగంచిప్రోలు ఎంపీపీ, వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ అన్నారు. మండలంలోని అనిగండ్లపాడులో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో హామీలిచ్చి అనంతరం ప్రజల్ని మోసగించడం సీఎం చంద్రబాబు నైజమన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంక్షేమాన్ని గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలుచేయని సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో పేదరికం పోవాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, నియోజకవర్గ ఎస్సీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు కీసర లోకేశ్వరరావు, బొశెట్టి బ్రహ్మం, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు చేని రాంబాబు, పూసల కార్పొరేషన్ మాజీ డైరక్టర్ కుమారి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, సొసైటీ మాజీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు గంగూరి ప్రసాద్, పొన్నం శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, దోసపాటి ప్రసాద్, గింజుపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వేమా సురేష్‌బాబు, కాలవ పెదబాబు, మాడుగుల, నేతలు



పోపూరులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, నాయకులు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, నాగమణి, రామారావు, నాయకులు

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి...

చందర్లపాడు(నందిగామ టౌన్): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై అన్నివర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం పోపూరు గ్రామంలో గురువారం రాత్రి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన హామీలను గుర్తుచేస్తూ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పనపై కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ఊరి చివరన ఏర్పాటు చేయగా, కూటమి ప్రభుత్వంలో ఏకంగా నివాస గృహాల మధ్యలో ఏర్పాటు చేయడంతోపాటు వీధివీధికి బెల్టుషాపులను ఏర్పాటు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో సీఎం చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ పార్టీ కన్వీనర్‌గా మామిళ్ల భాస్కర్‌రెడ్డిని నియమించారు. కార్యక్రమంలో నాయకులు గుడేటి శ్రీనివాసరావు, బెల్లంకొండ అశోక్, సంగం బలరామిరెడ్డి, ఆకుల రంగారావు, కోట ఎర్మి, కోట భూషయ్య, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపఎన్నికలకు కూడా భయపడుతున్నారు...

కంచికచర్ల: రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్థానికసంస్థల ఉపఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కూటమి నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు విమర్శించారు. స్థానిక ఇందిరాకాలనీ నాలుగో సెగ్మెంట్‌లో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వేమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను కూటమి నాయకులు నిలువునా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పాలనను గాలికొదిలేసిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, వేమా శివకోటి, అమర్లపూడి యోహాన్, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఎం.పాండురంగారావు, దాసరి రాంబాబు, మేకల బాబు, కోనాల దూండీ, గుగులోతు శివనాయక్, నారిశెట్టి శ్రీనివాసరావు, గ్రంధి ఆదిత్య, బుచ్చిబాబు, వేముల గోపి,, కావాటి సోమయ్య, కట్టా శౌరి, గొర్రెపాటు బాబు, మంగినేని వెంకట్రామయ్య, మేచర్ల సుకన్య, రాజవంశీ, విజయ్ గద్దల, బాణావత్ సురేష్, ఉప్పుతల తిరుపతిరావు, శేషం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



జగ్గయ్యపేటఅర్బన్: దోమల సమస్య పరిష్కరించాలంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర స్పందించారు. వార్డుల్లో దోమల నివారణకు కొనుగోలు చేసిన కొత్త ఫాగింగ్ మిషన్ పనితీరును గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో దోమల మందు ఫాగింగ్ చేయిస్తామన్నారు. ప్రజలు కూడా వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, డీఈఈ శివకోటేశ్వరరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం చేయాలని డిమాండ్

నందిగామటౌన్: ఎస్సీ వర్గీకరణకు త్వరితగతిన చట్టం చేసి మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ, ప్రైవేట్ సంస్థలలో కూడా వర్గీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కనకపూడి వెంకటరత్నం మాదిగ, జిల్లా కోకన్వీనర్‌గా కోండ్రు రాజారావు మాదిగలను నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీధర్ మాదిగ, విజయ్ మాదిగ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

నందిగామరూరల్: శిశువుకు తల్లిపాలకు మించిన సముతుల్య ఆహారం మరొకటి లేదని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలతోపాటు పట్టణంలోని పలు అంగనవాడీ కేంద్రాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే కలిగే ప్రయోజనాలను బాలింతలు, గర్భిణీలకు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ శిశువు పుట్టిన క్షణం నుంచే తల్లిపాలు పట్టడం బిడ్డకు, తల్లికి ఇద్దరికి శ్రేయస్కరమని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కామేశ్వరి, ఎంపీహెచ్‌వో బిక్షాలు, సూపర్‌వైజర్ కరుణకుమారి, తారాబి, వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు గుర్తించడంతోపాటు బిడ్డకు ఆరునెలలు వచ్చే వరకు తల్లిపాలే పట్టించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం తల్లిపాల వారోత్సవాలు తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ తల్లిపాలు పట్టిస్తే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ సిద్దారెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఎంపీటీసీ సభ్యురాలు కాకాని స్రవంతి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, పక్కన ఎంపీపీ గాంధీ, తదితరులు

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: బిడ్డకు తల్లిపాలకు మించిన ఆహారం మరొకటి లేదని ప్రభుత్వ వైద్యాధికారిణి హర్షిదా బేగం పేర్కొన్నారు. వత్సవాయి సచివాలయం వద్ద గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ హర్షిదాబేగం మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట తరువాత నుంచే తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి పెరుగుదలతోపాటు మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల లాం ఫాం గుంటూరు విద్యార్థులు, గరికపాడు కేవీకే ఆధ్వర్యంలో తల్లిపాల గురించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిపాల విశిష్టతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బీబీజాన్, పీవీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు: తల్లిపాలు తాగే పిల్లల్లో ఇన్‌ఫెక్షన్లు దరిచేరవని ఐసీడీఎస్ సెక్టార్ అధికారి ప్రభావతి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం అంగనవాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారిణి హర్షిదాబేగం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో రజనీ జ్వాలా

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలు అమృతంతో సమానమని ఇన్‌చార్జి సీడీపీవో ఆర్‌వి రజనీజ్వాలా పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం తల్లిపాల విశిష్టతపై బాలింతలు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని వివరించారు. చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగనవాడీ కేంద్రాలలో వారోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, టాటాట్రస్ట్ కోఆర్డినేటర్ మాధురి, వైద్య సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విశ్వభారతి డిగ్రీ కళాశాలలో గురువారం పోలీసులు శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నందిగామ శక్తి టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ బి.అభిమన్యు మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సేవించడం నేరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువు ప్రాముఖ్యతను గుర్తించి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళలపై వేధింపులు ఎలా గుర్తించాలి, బాధితులు ఎలాంటి భయం లేకుండా పోలీసులను ఎలా సంప్రదించాలి, శక్తి యాప్ వినియోగం, ర్యాగింగ్, డ్రగ్స్ కారణంగా దెబ్బతింటున్న విద్యార్థులు భవిష్యత్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ ఎస్ఐ జి.రాజు పాల్గొన్నారు.



శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ ఇన్‌చార్జి అభిమన్యు

గురుధాంకు జిల్లెల్లమూడి అమ్మవారి ప్రతిమ

బలుసుపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని గురుధాం క్షేత్రానికి జిల్లెల్లమూడి అమ్మ మైనపు ప్రతిమ గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మ ప్రతిమకు తాత్వికుడు గెంటేల వెంకటరమణ దంపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి జిల్లెలమూడి క్షేత్రానికి తరలిస్తున్న అమ్మవారి ప్రతిమ వారం రోజుల పాటు గురుధాంలో ఉంటుందన్నారు. ప్రతిమను తయారు చేసిన శిల్పి మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, గురుధాం భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రతిమను తీసుకువస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీ విప్ ఉదయభాను

స్థలం మంజూరు చేయాలని వినతి

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ దివ్యాంగుల సంఘం కార్యాలయానికి స్థలం మంజూరు చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షుడు వద్దేపూడి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పేట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఇన్‌చార్జి తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు.



జగనన్న కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

ఎంపీపీ షేక్ మలక్‌బషీర్



జగనన్నకాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్, పక్కన ఎంపీటీసీ సభ్యులు మధుబాబు

కంచికచర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. స్థానిక జుజ్జూరురోడ్డులోని జగనన్న కాలనీలో ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబుతో కలసి గురువారం ఆయన పర్యటించారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మలక్ బషీర్ మాట్లాడుతూ కంచికచర్ల పట్టణం నుంచి జగనన్నకాలనీకి వెళ్లే గ్రావెల్ రోడ్డును మండల పరిషత్ నిధులు రూ. 8 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసినట్లు వివరించారు. వీధి దీపాల ఏర్పాటుతోపాటు కాలనీలోని బోర్లకు మరమ్మతులు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ఈ సందర్భంగా విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీలు కట్టించి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని వారికి వివరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు సుబ్బారావు, దేవదానం, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గిరి ప్రదక్షిణ

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం గిరి ప్రదక్షిణ చేపడుతున్నట్లు ఈవో సాంబశివరావు గురువారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి కొండ కింద నున్న రోడ్డు నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

1374 మందికి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం సెంటర్‌లో మూడురోజులుగా జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 1374 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ గురువారం తెలిపారు. వీరిలో 983 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 360 మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయని, 133 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించినట్లు వివరించారు. శిబిరంలో కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, రామకృష్ణ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

18న షాపుల అద్దె వేలం

నందిగామరూరల్: పట్టణంలోని మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా ఉన్న మూడు షాపులకు ఈనెల 18న అద్దె ప్రాతిపదికన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మెయిన్ రోడ్డులోని షాపు నెంబరు ఏడు, ఆగ్నేయ దిశలోని ఒకటి, రెండు షాపులకు ఈనెల 18న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.

గాయనీ గాయకులు సాంస్కృతిక వారధులు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు సాంస్కృతిక వారధులని, వారికి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని అనిత ఆర్ట్స్ వ్యవస్థాపకుడు గొర్రెపాటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. అనిత ఆర్ట్స్ సినీ, లలిత సంగీత ఆవిర్భావ కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. అనిత ఆర్ట్స్ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తామని చెప్పారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో తమ పేర్లు చిరస్థాయిగా నిలుపుకొన్న గాయనీ గాయకులను నిత్యం స్మరించుకోవాలని సూచించారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు, వివిధ రంగాలకు చెందిన ప్రదీప్‌కుమార్, వేమూరి వెంకటేశ్వరరావులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. గాయనీ గాయకులు మీనాకుమారి, గాయత్రి, ఉమా బలరాం, విజయ్‌కుమార్ తదితరులు పాట పాడుదాం పేరుతో పలు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు.

నేటి నుంచి ఉచిత వైద్యశిబిరాలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు జయప్రద ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథజనార్దన్ గురువారం తెలిపారు. జనరల్ వైద్యశిబిరంలో షుగర్, బీపీ, రక్తపరీక్షలు, ఈసీజీ, ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి, దంత పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైనవారికి కళ్లజోళ్లు, ఉచితంగా శుక్లాల ఆపరేషన్‌చేయించనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు తప్పకుండా ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ రూరల్: నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. సాయంత్రం వరకు భరించలేని ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడగా, రాత్రి సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురవడంతో ప్రజలు ఒకింత సేదతీరారు. ఈ వర్షం పత్తి పంటకు జీవం పోసిందని రైతులు చెబుతున్నారు. వర్షాలు లేక పత్తి పంటతోపాటు నారుమడులు బెట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో వర్షం కురవడంపై రైతులు హర్షం వ్యక్తంచేశారు.